కర్నూలు | నంద్యాల
వార్త
1 జూన్ 2026 సోమవారం పేజీలు 4

## బనగానపల్లెలో మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి విస్తృత పర్యటన



**: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**

**బనగానపల్లె, మే 31 ప్రభాతవార్త:**
రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి శనివారం బనగానపల్లె పట్టణంలోని చంద్రబాబు నాయుడు నగర్, ఈద్గా నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో మురికినీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన మంత్రి డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేపటిలోగా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం బనగానపల్లెలో ఎస్ఆర్బీసీ కెనాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కార్పెంటర్ కాలనీ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. కాలనీలో నివసించే ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను ముందస్తుగా కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నంద్యాలలో.. వై.యస్.ఆర్. విగ్రహం ధ్వంసం..!

**- రాజకీయ దుమారం...ప్రజల్లో ఆవేదన** 2లో

**నంద్యాల టౌన్,మే 31,ప్రభాతవార్త:**
నంద్యాల పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీనివాస సెంటర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వై.యస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తలను గుర్తు తెలియని విధంగా వేరు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా తీర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో చాకలి జంబులయ్య అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే ఈ ఘటన వెనుక అసలు కారణాలపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రాజకీయ..సామాజిక వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటన ఎలా జరిగింధి..? ఆదివారం ఉదయం శ్రీనివాస సెంటర్‌లో ఏర్పాటు చేసిన వై.యస్.ఆర్.విగ్రహం వద్దకు వచ్చిన జంబులయ్య విగ్రహం తలను వేరు చేసినట్లు ప్రత్యేక సాక్షులు చెబుతున్నారు. అనంతరం తలను చేతిలో పట్టుకొని ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే స్తానికులు, వై.యస్.ఆర్. అభిమానులు అక్కడికి చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని నిందుతుడిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం అతనిపై విచారణ కొనసాగుతుంది. రాజకీయ ధుమారం..ఘటన



వెలుగులోకి వచ్చిన వెంటనే రాజకీయ వర్గాల్లో పరస్పర ఆరోపణలు మొదలయ్యాయి. కొందరు అతను వై.యస్.ఆర్.సి.పి. చెందిన వ్యక్తిగా ఆరోపిస్తున్నారు. మరి కొందరు జనసేన అనుచరుడని ప్రచారం చేస్తున్నారు. ఇంకొందరు రాజకీయ ప్రయోజనాల కోసం కావాలనే ఈ ఘటనను సృష్టించారని అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు పోలీసులు ఏ రాజకీయ పార్టీతోను సంభంధం ఉన్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. దీంతో

## గల్లంతైన.. మృతదేహాలు లభ్యం..!

- నాలుగు మృతదేహాలు వెలికితీత
- ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలించిన పోలీసులు
- మృతదేహాలకు ఎమ్మిగనూరులో పోస్ట్‌మార్టం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీతారామిరెడ్డి



**మంత్రాలయం, మే 31, ప్రభాతవార్త;**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఐదు మంది గల్లంతైన ఘటనలో ఆదివారం నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఓ పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బంధువులు తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి ఐదుమంది గల్లంతైన విషయం పాఠకులకు విధితమే. ఐదు మందిలో ధనుష్ అనే వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. అయితే మిగిలిన నలుగురు రాఘవేంద్ర,





సంధ్య, యువన్‌చంద్ర, సతీష్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు పుట్టీలు, గజ ఈతగాళ్ల సాయంతో ఈ నలుగు మృదేహాలను వెలికితీశారు. మొత్తం ఐదు మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలు లభ్యం కావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని మాజీ టీటీడీ బోర్డు మెంబర్ సీతారామిరెడ్డి పరిశీలించారు. సీఐ దస్తగిరిబాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు.







## ట్రాక్టర్ ప్రమాదంలో.. వ్యక్తి మృతి..!

**రుద్రవరం, మే 31, ప్రభాతవార్తః**
ట్రాక్టర్ ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి (30) అనే వ్యక్తి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని చందలూరు గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడి ట్రాక్టర్‌తో ఆర్ కొత్తూరు గ్రామ పరిధిలో తన పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా మాచినేనిపల్లె గ్రామ మెట్ట సమీపంలో ఉన్న నాలుగురోడ్ల కూడలిలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడడంతో డ్రైవర్ పవన్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన స్థలాన్ని రుద్రవరం ఎస్ఐ జయప్ప తన సిబ్బందితో కలిసి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## భానుముక్కలలో.. పోలీసుల కార్డెన్ సెర్చ్..!

**-15 మద్యం క్వాటర్ బాటిళ్లు స్వాధీనం..వ్యక్తిపై కేసు నమోదు**



**పాములపాడు, మే 31, ప్రభాతవార్తః**
పాములపాడు మండలం భానుముక్కల గ్రామంలో ఆదివారం ఉదయం పాములపాడు ఎస్ఐ తిరుపాలు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల, నేరచరిత్ర గల వారి ఇళ్ళలో తనిఖీలు చేశారు. నాగేశ్వరావు అనే వ్యక్తి నుండి 15 మద్యం క్వాటర్‌బాటిళ్ళను స్వాధీనం చేసుకొని ఆతనిపై కేసు నమోదుచేశారు. భానుముక్కల ప్రధాన సెంటర్‌లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సైతం ప్రధాన సెంటర్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాములపాడు పోలీసులు ఏఎస్ఐ జోసఫ్, పోలీసులు రమణ, శివకుమార్, ఆశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడుకలెక్టటరేట్ కార్యాలయంలతో ప్రజాఫిర్యాదుల కార్యక్రమము

**నంద్యాల, మే 31,ప్రభాతవార్తప్రతినిధి :**



నంద్యాల పట్టణంలోని కలెక్టరు కార్యాలయంలో పిజిఆర్‌యస్ హాల్లో నేడు గ్రీవెన్సు కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు కలెక్టరు రాజ కుమారి ఒక ప్రకటలో తెలిపారు. ఈ కార్యక్రము ఇక్కడే కాకుండా అన్ని డివిజన్ కేంద్రాల్లో, నియోజక వర్గ కేంద్రాల్లో మండల కేంద్రాల్లో ఉదయం 9.30నుండి మద్యహ్నాము 1గంటవరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు

## బీజేపీ జాతీయ మోర్చా సమావేశంలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే

**ఆదోని టౌన్, మే 31, ప్రభాతవార్త;**
ఢిల్లీ మహానగరంలో ఉన్న బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన జాతీయ బీసీ మోర్చా సమావేశంలో బీజేపీ (ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి), ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి.పార్థసారథి వాల్మీకి పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ నాయకత్వంలో మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి కృష్ణకౌర్, కర్ణాటక ఉడిపి ఎమ్మెల్యే యశ్పాల్ సువర్ణ, ఢిల్లీ ఎమ్మెల్యే గజేందర్‌యాదవ్, ఉత్తరప్రదేశ్ పార్లమెంట్ సభ్యులు సంఘం లాల్, బీహార్ మంత్రి నిఖిల్ ఆనంద్, మరికొంతమంది జాతీయ నాయకులు పాల్గొన్నారు.



## 28 మందికి.. రూ.14.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**: మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందజేత**

**బనగానపల్లె, మే 31 ప్రభాతవార్త:**
పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.14,20,195 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి తన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వైద్య సహాయం పొందిన లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి కల్పతరువుగా మారిందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్నామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై లబ్ధిదారులతో మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం.. ఘటన వెనుక కూటమి నేతల కుట్ర

**: శిల్పా.. కాటసాని..**
**నంద్యాల మే 31ప్రభాతవార్తప్రతినిది :**
నంద్యాల నడిబొడ్డున దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన వెనుక అధికార కూటమి పార్టీల కుట్ర దాగి ఉందంటూ వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడు జంబులయ్య వైసీపీ కార్యకర్త అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని సాక్ష్యాలతో సహా తిప్పికొడుతున్నారు. పోలీసులు, కూటమి నేతలు కుమ్మక్కయ్యారని.. లా అండ్ ఆర్డర్ పూర్తిగా లోపించి ందని వైసీపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, వైసీపీ సిఇసి మెంబర్ పి.పి నాగిరెడ్డి, వైసీపీ రాష్ట్ర ఈసి మెంబర్ సాయినాథరెడ్డి, వైసీపీ నేతలు కల్లూరి రామలింగారెడ్డి, నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు విజయశేఖర్ రెడ్డి, పురుషోత్తమరెడ్డి, మహేశ్వర రెడ్డి, రాష్ట్ర



రైతు విభాగం కార్యదర్శి రత్న బాబు చౌదరి, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసనగర్ సెంటర్ నందు ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొని తీవ్రనిరసన వ్యక్తం చేశారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు ఈ సంధర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు గుండెల్లో పెట్టుకున్న మహానేత డా. వైఎస్సార్ విగ్రహం తల భాగాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని వైసీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే.. నిందితుడు వైసీపీ వ్యక్తి అంటూ టీడీపీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారానికి తెరలేపిందని మండిపడుతున్నారు. నిజానికి నిందితుడు జంబులయ్య 2023 కంటే ముందే వైసీపీని వీడి టీడీపీలో చేరాడని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోటోలతో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కూడా వేశాడని సాక్ష్యాలను బయటపెట్టారు. అంతేకాదు, 2024 ఎన్నికల తర్వాత మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌తో నిందితుడు దిగిన ఫోటోలు కూడా స్పష్టంగా ఉన్నాయని, అలాంటప్పుడు అతను వైసీపీ కార్యకర్త ఎలా అవుతాడని ప్రశ్నిస్తున్నారు. కూటమి నేతల ప్రోద్బలంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపిస్తున్నారు. విగ్రహం వద్ద 24 గంటలు పర్యవేక్షించే సీసీ కెమెరా ఉన్నా.. పోలీసుల కంటే ముందు టీడీపీ నేతలకు సమాచారం ఎలా చేరింది? తెలియాలన్నారు. నంద్యాలలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం చెందిందని, పోలీసుల తీరు అత్యంత శోచనీయంగా ఉందని వైసీపీ నేతలు ధ్వజమెత్తారు. నిందితుడి వెనుక ఉండి నడిపించిన సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వైఎస్సార్ విగ్రహాన్ని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తామే స్వయంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హెచ్చరిస్తున్నారు.ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ ప్రయోజనాల కోసం మహానేత విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడి వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరో తేలాల్సి ఉంది.

## తుంగభద్ర నదిలో.. ఐదుగురు మృతి పట్ల మాజీ సీఎం సంతాపం..!

**మంత్రాలయం, మే 31, ప్రభాతవార్త;**
మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ఐదుగురు మృతిచెందిన విషాధకర ఘటనపై వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని వాపోయారు. బాధితా కుటుంబాలకు మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**– నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**
**కర్నూలు మున్సిపల్, మే 31, ప్రభాతవార్తః**
కర్నూలు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటలకే స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో వుంచుకొని ఇకపై ఈకార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రజలు లిఖీతపూర్వకంగా సమర్పించవచ్చన్నారు. ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.




## వరిగడ్డి వామి దగ్ధం

**: రైతు మద్దయ్యకు రూ. 1 లక్ష 80 వేల రూపాయలు నష్టం..**

**వెల్దుర్తి, మే 31, ప్రభాతవార్త**
కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం లోని సర్పరాజపురం గ్రామములో హరిజన చిన్న మద్దయ్య అనే రైతు కి చెందిన ఒక పెద్ద వరి గడ్డి వామి శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదమునకు గురయింది . ఈ అగ్ని ప్రమాదము సమాచారం అందుకున్న డోన్ ఫైరింజన్ వెల్లి సిబ్బంది, కేంద్రాధికారి రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అయినను ఆ రైతుకు రూ. 1 లక్ష 80 వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఆ రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు





# యుద్ధం పేరుతో ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తున్న ప్రభుత్వం

**కర్నూలు విద్య, మే 31, ప్రభాతవార్త:** యుద్ధం పేరుతో ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తున్న ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజీల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బహుజన ముక్తి పార్టీ దేశవ్యాప్తంగా నిరసన అందోళన పిలుపులో భాగంగా ఆదివారం కర్నూలు నగరంలో బహుజన ముక్తిపార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే సర్కిల్ నుండి పెరిగిన పెట్రోల్ డీజీల్, గ్యాస్ ధరలకు నిరసనగా ఎండ్ల బండితో, మోటార్ సైకిళ్ళ, ఆటోలను తోసుకుంటూ ర్యాలీని ఓబిసి మోర్చా జాతీయ నాయకులు డా.కంచర్ల హరిప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ పాలనలో దేశం సంక్షోభంలో ఉందన్నారు. విద్య, వైద్య రంగాల్లో పూర్తిగ విఫలమయిందని ఇది బీజేపీ



ప్రభుత్వమన్నారు. ఈసందర్భంగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీని ఉద్దేశించి బహుజన ముక్తి పార్టీ జిల్లా కన్వీనర్ దాసరి రామశేషయ్య, కో కన్వీనర్ ఎన్కె జయన్నలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తప్పుడు ఆర్థిక విధానాలతో దేశాన్ని ఆర్థికసంక్షోభంలోకి నెట్టుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన 2014లో పెట్రోల్ రూ.64లు, డిజిల్ రూ.56, గ్యాస్ రూ.440లు ఉండేదని నేడు పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలను 150 శాతం పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచింది. యుద్ధం పేరుతో ఆర్థిక దోపిడికి పాల్పడే ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడ లేదు. నిరసన కార్యక్రమంలో ఇంటెలెక్చ్యువల్ ఫోరం నాయకులు కదిరుల్లా, ఇక్బాల్, యూసుఫ్, బాంసెఫ్ నాయకులు పెరికల రంగస్వామి, భారత్ ముక్తి మోర్చా జిల్లా నాయకులు ఎం నాగరాజు, రవిభాస్కర్, ఎం రాజు, రంగయ్య, సుందర్ రాజు, సురేష్, మహేష్‌లు పాల్గొన్నారు.

## భగవంతప్పకు ఘనసన్మానం



**డోన్, మే 31, ప్రభాతవార్త :** డోన్ ఎల్ఐసి బ్రాంచ్ లో డెవలప్మెంట్ ఆఫీసర్ గా పనిచేస్తున్న భగవంతప్పకు ఆదివారం పదవి విరమణ సందర్భంగా ప్రధాన అధికారులు సహచరులు ఎం కె ఫంక్షన్ హాల్ నందు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా భగవంతప్ప మాట్లాడుతూ ప్రభుత్వ విధులలో పదవి విరమణ బదిలీలు సహజమని అందులో పదవి విరమణ పొందే అంతవరకు విధులు నిర్వహించడం గొప్ప వరమనే పేర్కొన్నారు విధులలో వివిధ రకరకాల సమస్యలు ఎదురైనప్పటికీ వాటినన్నిటిని ఎదుర్కొని విధులను సక్రమంగా నిర్వహించడమే గొప్పగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి దేగల ప్రభాకర్ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ అయ్యలన్న డాక్టర్ రవి కళాధర్ రెడ్డి డాక్టర్ జయరాం డాక్టర్ బాలచంద్రారెడ్డి ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్లు రాజశేఖర్ సుబ్బారావు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టాటా ఫుట్ బాల్ శిక్షణకు కర్నూలు క్రీడాకారులు



**కర్నూల్ స్పోర్ట్స్, మే 31, ప్రభావార్త :** గత నెలలో 28 నుండి 30 వరకు జరిగిన శీతితిశి ఫుట్బాల్ టోర్నమెంట్లో చక్కటి ప్రతిపను ఘనపరిచి కర్నూలు జిల్లాకు చెందిన జయంత్, రేణుక ,రామలక్ష్మి, అండర్ 21 విభాగంలో ముగ్గురు ఫుట్బాల్ క్రీడాకారులు క్రీడాకారులు జంషత్ పూర్ లోని టాటా ఫుట్బాల్ అకాడమీకి అకాడమీలో జరగబోయే 15 రోజులు శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు కర్నూలు జిల్లా ఫుట్బాల్ ప్రెసిడెంట్ ముప్ప రాజశేఖర్ తెలియజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ మన కర్నూలు జిల్లా చెందిన క్రీడాకారులు ఇంతటి చక్కటి ప్రతిభను కనిపరిచినందుకు ఆయన ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు జంషద్పూర్ లో జరగబోయే ఫుట్బాల్ అకాడమీలో చక్కటి ప్రతిభను ఘనపరిచి టాటా ఫుట్ బాల్ కు ప్రాతినిధ్యం వహించాలని ఆయన ఆకాంక్షించా ర కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు బీ క్యాంప్ ఫుట్ బాల్ సెక్రటరీ పాల్ విజయ్ కుమార్ , లక్ష ఫూట్ బాల్ కోచ్ బ్రహ్మకుమార్ ఫుట్ బాల్ కోచ్ విజయ్ కుమార్ జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు

## ఆర్టీసీలో 40 ఏళ్ల సుదీర్ఘ సేవలు

**: ముల్లా షఫీవుల్లా పదవీ విరమణ సన్మానం..**

**ఆత్మకూరు, మే 31, ప్రభావార్త :** పట్టణానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి ముల్లా షఫీవుల్లా ఆదివారం పదవీ విరమణ చేశారు. గత 40 సంవత్సరాలుగా ఆర్టీసీ సంస్థలో ఏడీసీ గా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గ్రేడ్3 గా విశేషమైన, నిష్కలంకమైన సేవలు అందించారు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఆత్మకూరు డిపో గ్యారేజీ ప్రాంగణంలో డిపో మేనేజర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు కుటుంబ



సభ్యులు కలసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. క డిపో మేనేజర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ షఫీవుల్లా తన 40 ఏళ్ల సర్వీసులో సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు ఎంతో బాధ్యతాయుతంగా సేవలు అందించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షిస్తూ తోటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిపో కమిటీ సభ్యులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బందికుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**- యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం - ఎస్ఐ**



**పాములపాడు, మే 31, ప్రభాతవార్త:** రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాములపాడు ఎస్ఐ తిరుపాలు, మాజీ సర్పంచ్ వరప్రసాద్‌రావు హాజరయ్యారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల ఎస్ఐ తిరుపాలు సంతోషం వ్యక్తపరిచారు. రక్తదానం చేయడం వల్ల ఓ నిండు ప్రాణాన్ని కాపాడినవారు అవుతారని ఎంతో మంది రోడ్డు ప్రమాదంలో సమయానికి రక్తం దొరక్క మరణించడం జరుగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడినవారవుతారని ఎస్ఐ అభినందించారు. 51 మంది రక్తదానం చేశారు.

## వైభవంగా రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షన**

**ఎమ్మిగనూరు టౌన్, మే 31, ప్రభాతవార్త :** ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలో అభిమానుల సందడి మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి రాజీవ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంజి సర్కిల్ లో ఏర్పాటు



చేసిన రాజీవ్ రెడ్డి బారి కటౌట్ ముందు క్రేన్ సహాయముతో బారి గజమాల తో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి వల్లే యువతలో మంచి ఆదరణ పొందారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమయ్యే రోగులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా జన్మదినాన్ని జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పేదలకు ఆహార పంపిణీ, రోగులకు పండ్ల పంపిణీ, విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేయడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకు పరిమితం చేయకుండా సామాజిక బాధ్యతతో నిర్వహించడం విశేషమని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో



పాల్గొన్న వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు రాజీవ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకుడిగా రాజీవ్ రెడ్డి ఎదుగుతున్నారని పలువురు కొనియాడారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలతో కార్యక్రమ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరంతో ఎర్రకోట రాజీవ్ రెడ్డి జన్మదినోత్సవం ఎమ్మిగనూరులో ప్రత్యేకంగా నిలిచింది.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

**: ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఎ.షహ బుద్దిన్.**



**ఆత్మకూరు, మే 31, ప్రభాతవార్త :** పట్టణంలోని వ్యవసాయ పరపతి సహకార సంఘం లిమిటెడ్ సీఈఓ ఏ . నాగేశ్వరరావు పదవి విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం చేపట్టారు ఈ ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సింగల్ విండో చైర్మన్ ఎ. షహ బుద్దిన్. హాజరై శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ ఆత్మకూరు సొసైటీ లో 34 సంవత్సరాలు ఉద్యోగం చేస్తూ సొసైటీకి విశిష్ట సేవలందించి సీఈఓ గా పదవి విరమణ చేస్తున్న ఏ . నాగేశ్వరరావు ఆరోగ్యంగా ఉంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, అదేవిధంగా సొసైటీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఆర్టీసీ డిపోలో పదవి విరమణ పొందిన ఆర్టిసి ఎడిసి ఎం . షఫీ ఉల్లా పంచాయతీరాజ్ ఉద్యోగి పి . మొహమ్మద్ ఖాసిం గార్లను ఘనంగా సన్మానించడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు శివ ప్రసాద్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు రమేష్, ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు దినకరరావు, ప్రసాద్ రావు, ఆన్సర్ అలీ, జిల్లా అధికారులు నగేష్, అబ్దుల్ కలాం, వివిధ సొసైటీ సీఈఓ లు, రైతులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల టాపర్‌గా నిలిచిన ప్రవల్లికకు మంత్రి అభినందనలు

**బనగానపల్లె, మే 31, ప్రభాతవార్త :** పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.జి. వేముల ప్రవల్లిక పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచింది. తొలుత విడుదలైన ఫలితాల్లో 583 మార్కులు సాధించిన ఆమెకు రీ వెరిఫికేషన్ అనంతరం మరో 8 మార్కులు పెరగడంతో మొత్తం 591 మార్కులు లభించాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా ప్రవల్లిక నిలవడమే కాకుండా, నంద్యాల జిల్లాలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రవల్లిక, ఆమె తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, ఆయన సతీమణి ఇందిరా రెడ్డిని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి దంపతులు ప్రవల్లికను, ఆమె తల్లిదండ్రులను అభినందించి జ్ఞాపికతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన "షైనింగ్ స్టార్" కార్యక్రమంలో ప్రతి పాఠశాల నుంచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మంత్రి దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. అయితే జిల్లా స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన ప్రవల్లికకు ప్రత్యేకంగా మరోసారి నగదు బహుమతి అందజేయడం పట్ల ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి, శ్రీగౌరి, నీలిమ తదితరులు పాల్గొని మంత్రి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కండక్టర్ శాంతికి సేవ రత్న అవార్డు

**డోన్, మే 31, ప్రభాతవార్త :** డోన్ ఆర్టీసీ డిపోలో దాదాపు 27 ఏళ్లుగా కండక్టర్గా పనిచేస్తున్న శాంతికి సేవా రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని డోన్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మజ్దూర్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆదివారం నెల్లూరులో జరిగిన అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీమాన్ అవధానం సాయికుమార్ గారి చేతుల మీదుగా పురస్కారం లభించడం సంతోషకరమన్నారు అదేవిధంగా విధులను నిర్లక్ష్యం చేయకుండా సేవలందించడం ఆమె ప్రత్యేకత 2017లో ఇన్నర్ విల్ క్లబ్ లో చేరి సెక్రటరీగా 2022లో ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షులుగాను బాధ్యతలు చేపట్టి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు పలు సేవా కార్యక్రమాలలో తోపాటు విధులను కూడా సక్రమంగా నిర్వర్తిస్తూ తోటి సహచర లతో మంచి గుర్తింపు తెచ్చుకుని వ్యక్తిగా శాంతి నిలిచారని తెలిపారు.



# నంద్యాలలో.. వై.యస్.ఆర్. విగ్రహం ధ్వంసం..!

(మొదటి పేజీ తరువాయి ) : రాజకీయ నాయకలు ఎవరికి వారు తమపై నిందలు పడకుండా జాగ్రత్త పడుతున్న పరిస్థితి కనిపిస్తుంది. మతి స్థిమితం లేని వ్యక్తా లేక ప్రణాళికబద్ధ చర్యా..;? ఈ ఘటనలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే, కొంత మంది స్థానికులు జంబులయ్యకు మానసిక సమస్యలు ఉన్నాయని చెబుతుండగా, మరి కొందరు అది కేవలం తప్పించుకునేందుకు సృష్టిస్తున్న కథనమని అభిప్రాయపడుతున్నారు. విచారణలో తేల్లాల్సిన అంశాలు...నిందుతుడు ఒక్కడే ఈ చర్యకు పాల్పడ్డడా...? ఎవరైన ప్రేరేపించారా...? రాజకీయ కోణం ఉందా వ్యక్తిగత విద్వేశ్యం కారణమా, నిజంగానే మానసిక అస్వస్థతతో చేశాడా...? ఈ ప్రశ్నలకు సమాధానాలు పోలీసుల విచారణ తరువాతే వెల్లడయ్యే అవకాశం ఉంది. వై.యస్.ఆర్. అంటే ఒక భావోద్వేగం...వై.యస్సార్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాధించిన నాయకుడు, రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజురియంబర్స్‌మెంట్, జలయగ్నం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారు. అందుకే ఆయన విగ్రహం ధ్వంసం కావడం కేవలం రాజకీయ ఘటనా కాకుండా అనేక మంది ప్రజలు భావోద్వేగంగా స్వీకరిస్తున్నారు. ముఖ్యంగా వై.యస్.ఆర్.సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాలలో ఉద్రిక్తత.. ఘటన తరువాత శ్రీనివాస సెంటర్ పరిసరాలలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అదనపు భందోబస్తు ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు సంఘటనా స్థలాన్ని సందర్శిస్తూ తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచార యుద్ధం...ఈ ఘటన తరువాత సోషల్ మీడియాలో అనేక కథనాలు, వీడియోలు, పోస్టులు, వైరల్ అవుతున్నాయి. కొందరు రాజకీయ పార్టీలను లక్ష్యంగా చేసుకొని ప్రచారం చేస్తుండగా మరి కొందరు ఇది పూర్తిగా వ్యక్తిగత చర్య అని వాదిస్తున్నారు. అధికారిక విచారణ పూర్తికాక ముందే వివిధ ప్రచారాలు జరగడం వల్ల ప్రజలలో గంధరగోళం ఏర్పడుతుంది. పోలీసులపై కీలక భాధ్యత... ఈ ఘటనలో నిజా నిజాలు వెలికి తీయడం ఇప్పుడు పోలీసుల ముందు ఉన్న ప్రధాన సవాల్. పోలీసులు...సిసి టీవి పుటేజీలను పరిశీలించాలి, నిందుతుడి మానసిక పరిస్థితిపై వైద్య పరీక్షలు నిర్వహించాలి. రాజకీయ, వ్యక్తిగత కోణాలను సమగ్రంగా పరిశీలించాలి. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. నంద్యాలలో జరిగిన వైయస్సార్ విగ్రహం ధ్వంసం ఘటన ఒక సాధారణ విధ్వంస చర్యగా కాకుండా రాజకీయ, సామాజిక, భావోద్వేగపరమైన ప్రబావాలను కలిగిస్తుంది. అసలు కారణం ఏమిటన్నది పోలీసు విచారణలో తేలాల్చి ఉన్నప్పటికి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాధించిన నాయకుడి విగ్రహం అవమానానికి గురి కావడం అనేక మందిని కలిచివేసింది. రాజకీయ అరోపణలు, ప్రత్యారోపణలకు అతీతంగా వాస్తవాలు వెలుగులోకి రావడం ద్వారా మాత్రమే ఈ ఘటనపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

## పౌర్ణమి సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ..

**: మొక్కులు తీర్చుకున్న భక్తజనం.. : ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం..**



**బనగానపల్లె, మే 31, ప్రభాతవార్త:** నందవరం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం ఆదివారం పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రాకపోకలు అధికంగా కనిపించాయి. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో సందడిగా మారగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన అధికారులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పాములపాడు, మే 31, ప్రభాతవార్త:** పాములపాడు మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదవతరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. అనాటి ఉపాధ్యాయులను పిలిపించి వారికి ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడం ద్వారా ఆత్మీయంగా వారి స్నేహం ఎంతో బలపడుతుందని తద్వారా పాఠశాలకు ఒకరినొకరు సాయం అందించుకునే అవకాశం ఉంటుందన్నారు. భావితరాలకు ఇలాంటి కార్యక్రమాలు ఓ దిక్సూచిగా ఉంటాయన్నారు. ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినప్పటికి రక రకాల వివిధస్థాయిల్లో ఉన్నవారు ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకోవడం అభినందనీయమని తెలిపారు. పూర్వపు విద్యార్థులు అలనాటి తీపీ జ్ఞాపకాలు, చిన్ననాటి జీవితాన్ని గుర్తుచేసుకొని మధురజ్ఞాపకాలతో గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, శివరాం, రమణారెడ్డి, లింగన్న, రవిశంకర్, వెంకటరామిరెడ్డి, మురళీమోహన్, రామకృష్ణ, సుబ్బయ్య, పూర్వపు విద్యార్థులు నాగార్జున్‌రెడ్డి, ఈశ్వరయ్య, ప్రతాప్, సామన్న, ప్రవీణ్, రవీంద్రనాయక్, గంటా మధు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి

**కర్నూలు విద్య, మే 31, ప్రభాతవార్త:**

స్థానిక క్లస్టర్ యూనివర్సిటి పరిధిలోని కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లి కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతి పొందిన వారిలో డా.కె వెంకటరెడ్డి కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందిస్తున్న డా. కె వెంకటరెడ్డి అదేకళాశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ పదోన్నతి పొందారు. డా.ఇర్ఫానా బేగం కెవిఆర్ కళాశాలలో ఉర్దువిభాగం లెక్చరర్‌గా పనిచేస్తున్న డా.ఇర్ఫానా బేగంకు పాణ్యం ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. సిల్వర్ జూబ్లి కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న డా.కె నాగరాజశెట్టి సిల్వర్ జూబ్లి ప్రభుత్వ కళాశాల, కర్నూలు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి సాధించారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఫర్ మెన్, కర్నూలులో పనిచేస్తున్న డా.డి నాగన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందికోట్కూరు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఫర్ మెన్ కర్నూలు పనిచేస్తున్న డా.టి మాదన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోర్నాల (మార్కాపురం జిల్లా) ప్రిన్సిపాల్‌గా పదోన్నతి సాధించారు. ఈసందర్భంగా కళాశాలలో సుదీర్ఘకాలం సేవలు అందించి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందిన అధ్యాపకులను క్లస్టర్ యూనివర్శిటి అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు : ఎస్ఐ నరేంద్ర

**: బీరవోలులో 25మధ్యం సీసాలు పోలీస్‌లు స్వాధీనం : నిబంధనలు ఉల్లంగించిన వాహనందారులకు జరిమానా**



**పగిడ్యాల, మే 31, ప్రభాతవార్త :** ప్రశాంతమైన గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవనీ ముచ్చుమర్రి ఎస్ఐ కే.నరేంద్ర తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పగిడ్యాల మండలం బీరవోలు గ్రామంలో ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ముచ్చుమర్రి ఎస్ఐ కే.నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. అనుమానితుల ఇండ్లల్లో తనిఖీలు సోదాలు చేశారు. అందులో భాగంగా బీరవోలు గ్రామానికి చెందిన బెన్నెకంటి వెంకటేశ్వర్లు గౌడు వద్ద ఉన్న 25 ఆఫీసర్స్ ఛాయిస్ క్వార్టర్ మధ్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. అదేవిధంగా నిబంధనలు ఉల్లంగించిన 5మోటార్ బైకుల యజమానులకు జరిమనా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసాలకు మోసపోతున్నారనీ, కావున వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అబ్బాయి 21 సంవత్సరాలు, అమ్మాయికి 18సంవత్సరాలు నిండిన అనంతరం వివాహం చేయాలనీ, వయసు ఏమాత్రం తక్కువఉన్నవారికి వివాహం చేస్తే బాల్యవివాహం చట్టం కింద నేరమవుతుందన్నారు. బాల్యవివాహం చేసుకున్నవారు వారిని ప్రోత్సహించినవారు కూడాను శిక్షార్హులవుతాన్నారు. మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించినా వేధింపులకు పాల్పడినా తీవ్రపరిమాణామాలువుంటాయన్నారు. హెల్మెట్ లేకుండా మోటర్ బైక్ నడపరాదనీ, హెల్మెట్ లేకుండా మోటర్‌బైక్ నడిపితే ప్రమాదాలు జరిగేఅవకాశాలు ఉన్నాయనీ, కావున ప్రాణరక్షణ కోసం మోటర్‌బైక్ యజమానులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాల నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. రోడ్డు భద్రతా నియమాలు గురించి, శక్తియాప్ గురించి వివరించి ఎస్ఐ కే.నరేంద్ర వివరించారు.

**లక్ష్మాపురంలో మహిళలకు అవగాహన కల్పించిన ఎస్ఐ :** జిల్లా అధికారుల ఆదేశాలమేరకు లక్ష్మాపురంలో ఆదివారం సాయంత్రం ముచ్చుమర్రి ఎస్ఐ కే.నరేంద్ర మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతపై చర్యలు, శక్తియాప్ వినియోగం, బాల్యవివాహాల నివారణ, రోడ్డు భద్రతా నియమాలు గృహహింసకు సంబంధించిన చట్టపరమైన చర్యలు గురించి వివరించారు. మహిళల రక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి మహిళలకు ముచ్చుమర్రి ఎస్ఐ నరేంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్.డి.నాగన్న



**నందికొట్కూరు,మే 31,ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్. డి.నాగన్న నియమితులయ్యారు. కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలుర) లో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తూ పదోన్నతిపై రెగ్యులర్ ప్రిన్సిపాల్ ఇక్కడికి బదిలిపై రావడం జరిగింది. దీంతో ఇక్కడ ఎఫ్ఏసి ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్న కె.రంగముని ఆదివారం ఆయనకు భాధ్యతలు అప్పగించారు. నూతనంగా భాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ ను అధ్యాపకులు పి.రవి, కె.ఖాజా హుస్సేన్, నాగరాజుశెట్టి, దలవాయి శ్రీనివాస్, మాదన్న, వెంకటస్వామి, వాయిజ్, ఎం.నాగన్న, ఓబులేష్, భోదనేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**– సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న**




**ఆదోనిలీగల్, మే 31, ప్రభాతవార్త;** ఫర్టిలైజర్ హమాలీ ప్రభుత్వ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎన్‌డీఆర్ ఫర్టిలైజర్స్ గోడౌన్ హమాలీ సమావేశం బి.రాజా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవెంజ్ యాజమాన్యం వారు హమాలీల కూలీ రేట్లు గత అగ్రిమెంట్‌కు గానూ రూ.5 పెంచడం జరిగిందని, మేనేజర్ సూరిబాబుకు సీఐటీయూ హమాలీలు తరపున అభినందనలు తెలియజేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు హమాలీలకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. ఈ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల హమాలీలకు వీరి కుటుంబాలకు ఎంతో ఉపయోగ పడేదన్నారు. పని సందర్భంలో ఏమైనా జరిగినా కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా ఇన్సూరెన్స్, పీఎఫ్, బోనస్ సౌకర్యాలు ఇచ్చేవిధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు నాగరాజు, గోవిందు, బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్ వెంబడి పశువులు, గొర్రెలను వదలొద్దు..

**– ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బి.మల్లేశ్వరయ్య**



**ఆదోనిలీగల్, మే 31, ప్రభాతవార్త;** రైల్వే ట్రాక్‌ల వెంబడి పశువుల యజమానులు తమ పశువులను, బర్రెలను వదలరాదని ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఎస్ఐ బి.మల్లేశ్వరయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆస్పరి మండల పరిధిలోని చిగిళి గ్రామంలో పశువులు, గొర్రెల యజమానులు, ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. రైల్వే ప్రాంతాల్లో, రైల్వే ట్రాక్‌ల వెంబడి పశువులను మేపడం, ట్రాక్‌లను దాటించడం చేయ కూడదన్నారు. అలా చేయడం వల్ల రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి వల్ల ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. అలాంటి ప్రమాదాలకు పాల్పడితే రైల్వే చట్టపరంగా యజమానులపై కసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాయన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



**హొళగుంద, మే 31, ప్రభాతవార్త;** మండల పరిధిలోని దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గిరిస్వామి, మనోహర్ స్వామి ఆధ్వర్యంలో మాళ మల్లేశ్వరస్వామి వారికి కుంకుమార్చన, జలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశరు.

# భక్తుల క్షేమం పట్టని పీఠాధిపతి, జిల్లా దేవదాయశాఖ అధికారి..

**– భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి – సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.భాస్కర్‌యాదవ్**



**మంత్రాలయం, మే 31, ప్రభాతవార్త;** మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల క్షేమం పీఠాధిపతికి, జిల్లా దేవదాయశాఖ అధికారికి పట్టడం లేదని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.భాస్కర్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. తుంగభద్ర నది తీరంలో భక్తులు స్నానాలు చేసేందుకు వెళ్లే సమయంలో అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవన్నారు. దీంతో స్నానాలు చేసేందుకు వెళ్లే భక్తులు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత రెండు రోజుల క్రితం నదిలో స్నానం చేసేందుకు దిగిన ఐదు మంది మృత్యువాత పడడం జరిగిందన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

# జోన్-5 రీజనల్ కో ఆర్డినేటర్‌ని కలిసిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్

**– ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ**



**దేవనకొండ, మే 31, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని విమల రెసిడెన్స్‌లో జోన్-5 రీజనల్ కో ఆర్డినేటర్ పెల్లికూరు శ్రీనివాసులురెడ్డిని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి, టీడీపీ పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు వంటి పలు ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# ఖరీఫ్ సీజన్‌లో రైతులను మరిచిన కూటమి ప్రభుత్వం

**– వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు**



**మద్దికెర, మే 31, ప్రభాతవార్త;** కూటమి ప్రభుత్వం ప్రచారాలకు తప్పా ప్రజలకు, రైతులకు మేలు చేయడానికి సరైన సమయానికి ముందుకు రావడం లేదని వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు ఆరో పించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ నెల ప్రారంభమైనప్పటికీ రాయితీతో కూడిన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం రైతులకు ఇప్పటివరకు అందించలేదన్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం కింద రైతులకు అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ చేసి ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని సకాలంలోనే రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గంధం చంద్రకంటి మల్లికార్జున పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు



**మద్దికెర, మే 31, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి విశేష పూజలైన పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకుడు విజయప్రసాద్‌యాదవ్ తెలిపారు. మద్దికెర గ్రామానికి చెందిన మారుగొండు జయరాముడు, మారగొండు జ్యోతి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారని నిర్వాహకుడు తెలిపారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి -ఎస్సై నరేష్



**తుగ్గలి,మే 31,ప్రభాతవార్త:** నేర ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లు తమ పద్దతిని మార్చుకుని సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని తుగ్గలి ఎస్సై నరేష్ హెచ్చరించారు. ఆదివారం తుగ్గలి పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్ ఆవరణంలో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్సై మాట్లాడుతు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాత నేరాలను పక్కన పెట్టి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సాధారణ జీవితాన్ని గడపాలని హితువు పలికారు. ప్రతి ఒక్కరి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుంది. ఎవరైనా తిరిగి నేర ప్రవృత్తి వైపు వెళ్లినా, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వై.యస్.ఆర్.విగ్రహా ధ్వంసం ప్రజాస్వామ్యంపై దాడి




**నంద్యాల హాస్పటల్,మే 31,ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో వైయస్సార్ విగ్రహా ధ్వంసం చేయడం అంటే ప్రజా స్వామ్యంపై దాడి అని సిపిఐ నాయకులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్తానిక కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.భాభాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతు దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం గుర్తు తెలియని దుండుగులు ధ్వంసం చేసిన ఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటన జరిగిన గంట వరకు కూడా పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వచ్చి సమీక్షించక పోవడం విచారకరమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని మాత్రమే కాకుండా అతని వెనుక ఉన్న అసలు సూత్రదారులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిందుతులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

# గోవును జాతీయ జంతువుగా కేంద్రం ప్రకటించాలి



**నందికొట్కూరు,మే 31,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా ప్రకటంచి గోవు సంరక్షకుల ముసుగులో సాగుతున్న హింసకు అడ్డుకట్టు వేయాలని మస్జిద్..ఏ..మహాబూబ్ ముత వల్లి సొదీ చాంద్ డిమాండ్ చేశారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతు గోవు అంటే అందరికి గౌరవమేనని గోవు తల్లిలాంటిదని వాటిని సంరక్షించుకోవడం మనందరి భాధ్యత అని, గోవును(ఆవు) జాతీయ జంతువుగా ప్రకటిస్తే గో సంరక్షణ చట్టాల్లో ఏకరూపతకు దారి తీయడంతో పాటు గో సంరక్షణ ముసుగులో సాగుతున్న వ్యాపారాలు, హింసకు అడ్డుకట్టు వేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అంతే కాక గోవును బలి ఇవ్వాలని ఏ మత గ్రంధములో చెప్పలేదని, తోటి పౌరులకు భాధ కలిగించే చర్యలకు పాల్పడ వలసిన అవసరంలేదని, ఆవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే ఒక చట్టడం ఏర్పడి ఆవును అమ్మడం కాని కొనడం కాని నేరమని అందరికి తెలుస్తుందన్నారు. ఈ నెల 28న జరిగిన బక్రీద్ పండుగ సంధర్భంగా ముస్లీం మత పెద్దలు, పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ఎవరు కూడా ఆవులను కుర్బాని ఇవ్వలేదని ఇది హిందూ ముస్లీంల ఐక్యతకు అద్దం పడుతుందన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి నంద్యాల పార్లమెంట మెంబర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తమ వంతు భాధ్యతగా తీసుకెళ్ళి ప్రకటించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏడు రోజులుగా కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్ర



**నందికొట్కూరు, మే 31, ప్రభాతవార్త:** పట్టణంలో నెలకొన్న సమస్యలను అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్ళేందుకు సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం ఏడవ రోజు సాగింది. ఈ సంధర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రఘురాంమూర్తి శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ సమీపంలో ఉన్న డ్రైనేజీ కాలువను పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని పాలకులకు, అధికారులకు సిపిఐ పార్టీ వినతి పత్రాలు, ధర్నాలు చేసి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. దెబ్బతిన్న బ్రిడ్జి కె.జి.రోడ్డు రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ఇప్పటికైన అధికారులు స్పంధించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని లేని పక్షంలో పట్టణ ప్రజలతో కలిసి ఆంధోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ నాయకులు వెంకటేశ్వర్లు, సుంకన్న, స్వాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**వెలుగోడు,మే 31,ప్రభాతవార్త:** పట్టణంలోని భాషా నగర్‌లో ఆదివారం డాక్టర్.ముల్లా అబ్దుల్ ఆఫ్రిద , పిట్టల మహమ్మద్ ఇబ్రహీం, పట్టల నూరుల్లా సహాకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింధి. ఈ సంధర్భంగా అవాజ్ కమిటీ నాయకులు మహమ్మద్‌రఫీ, సీనియర్ పాత్రికేయులు సుల్తాన్ మొహీద్దిన్, ఇలియాస్‌ఖాన్, పిట్టల నూరుల్లా మాట్లాడుతు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం మానవ సేవయే మాధవ సేవ అన్నారు. సమాజానికి ప్రతి ఒక్కరు తమకు తోచిన సాయం చేయాలని పిలుపు నిచ్చారు. శిబిరంలో రోగులకు వైద్య చికిత్సలు, అలాగే బీపి, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణి చేశారు. దాదాపు 150 మందికి వైద్యం అంధించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ముల్లా అబ్దుల్ అఫ్రిద్, డాక్టర్.ముషరఫా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి శాలలో లలితా సహస్రనామ పారాయణం



**వెలుగోడు,మే 31,ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో అధిక జేష్ట పౌర్ణమి మాసాన్ని పురష్కారించుకొని లలితా సమస్రనామ పారాయణం, కోటి ప్రదర్శనల కార్యకమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆరు గంటల నుండి సోమవారం ఉదయం 8 గంటల వరకు నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహిళలతో పాటు వివిధ మండలాల నుండి భారీగా తరలి వచ్చి సామూహిక లలితా సహస్రపారాయణం చేశారు. ఈ సంధర్బంగా పారాయణ విశిష్టతను దీపిక, అనురాధ, మాధవి, నాగమణిలు వివరించారు. లలితా సస్రనామం శ్రీచక్రానికి ప్రతి రూపమని వారు తెలిపారు. ప్రధానంగా అధిక మాసంలో పౌర్ణమి రోజున పారాయణం చేస్తే కోటి రెట్లు ఫలితం లభిస్తుందని శాస్త్ర వచనం, దుష్ట శక్తులుతొలగి జ్ఞానం, ఐశ్వర్యం సిద్దిస్తాయని విశ్వసిస్తున్నట్లు వారు తెలిపారు. పారాయణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి శాల అధ్యక్షులు లాలం సుధాకర్, శ్రీనువాసులు, నాగపుల్లయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నేలబెలుంలో పౌర్ణమి పూజలు



**కొలిమిగుండ్ల, మే 31, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండలంలోని బందార్లపల్లె సమీపంలో గత నేలబెలుం శ్రీభ్రమరాంబ సమేత మల్లేశరస్వామి పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. ఆలయ అర్చకులు రవిసా ్వమి ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులు అధిక జేష్టమాస పౌర్ణమి పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల, అనంతపురం, కడప జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఈ ఆలయానికి పౌర్ణమి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో వివిధ అర్చనలతో పాటు ఊయాల సేవ కూడ భక్తిశ్రద్దలతో నిర్వహించారు.

# గ్రంథాలయాలు మానసిక వికాసకేంద్రాలు

**– గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ**



**పగిడ్యాల, మే 31, ప్రభాతవార్త :** గ్రంథాలయాలు మానసిక వికాస కేంద్రాలని గ్రంథాలయ అధికారిణి కే. మద్దమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆధ్వర్యంలో ఆధివారం వేసవి విజ్ఞాన శిభిరము నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాయల అధికారిణి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు మానసిక వికాస కేంద్రాలుగా ఉపయోగపడుతాయన్నారు. గ్రంథాలయంలో తనకు నచ్చిన పుస్తకాన్నిచదివి తమ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. విద్యార్థులు " చందమామ కథలు " కథలలో " రాజు ప్రజలు " అనే కథను విద్యార్థులచేత చదివించి విద్యార్థులకు దాని భావమును గ్రంథాలయ అధికారిణి వివరించారు. విద్యార్థులు చెస్, క్యారమ్స్, క్రికెట్ ఆటలు ఆడుకున్నారు. విద్యార్థులకు స్వీట్స్, చాక్లెట్స్ గ్రంథాలయ అధకారిణి కే.మద్దమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# మైపర్‌లో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

**కర్నూలు విద్య, మే 31, ప్రభాతవార్త:** కర్నూలు నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం జార్జ్ 94వ జయంతి సందర్భంగా విద్యాసంస్థల వ్యవస్థాపక దినోత ్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జార్జ్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రతి ఒక్కరు ఆయన చేసిన సేవలను విద్యావ్యాప్తికి ఏవిధంగా కృషిచేసింది కొనియాడారు. మొట్టమొదటగా ఎస్ఆర్‌సీ బీఈడి కళాశాలను రాయలసీమలోనే మొట్టమొదటి కళాశాలగా స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందించి ఆ విద్యార్థులు రాష్ట్రమంతా ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారు. అలాగే థెరిసా డిగ్రీ కళాశాల శ్యాముల్ జార్జీ ఇంజనీరింగ్ కళాశాల మార్కాపురం శ్యాముల్ జార్జీ ఫార్మసీ కళాశాల, మైపర్ ఫార్మసీ కళాశాల కర్నూలు, థెరిసా ఇంటర్మీయేట్ కళాశాల ఆత్మకూరు ద్వారా విద్యను అందించడం ద్వారా ఎంతో మంది విద్యార్థులను విజ్ఞానవంతులను చేయడం జరిగింది. ఈసందర్భంగా జార్జీ సేవలను ప్రతిఒక్కరు గుర్తుచేసుకోవడం జరిగింది. ఈసందర ్భంగా కళాశాలల డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ వారి తండ్రిని గుర్తుచేసుకొని జార్జీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డా. స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డా.ఎం రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. కాసర్ల సురేష్, ఎస్సార్సీ బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రకాష్, భాస్కర్, ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.



04 page 2_04 page 2.qxd 31-05-2026 PM 10:37 Page 1



# మెగా డీఎస్సీపై.. వైసీపీ విమర్శలు.. హాస్యాస్పదం



**ఆదోని మే 31 ప్రభాతవార్త :**
గత రెండు మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు మెగా డీఎస్సీపై చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని అన్నారు. మెగా డీఎస్సీలో ఏదో పెద్ద అవినీతి జరిగిపోయినట్లు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తాడేపల్లి నుంచి వచ్చిన స్క్రిప్టును పట్టుకుని వైసీపీలో ఉన్న చిన్నా చితకా నాయకులందరూ ఒకే విధంగా మాట్లాడుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఇంచార్జ్ ఏర్పాటు చేశారు ఈ ఆమె సందర్భంగా మాట్లాడుతూ మెగా డీఎస్సీ గురించి మాట్లాడే ముందు వైసీపీ నాయకులు తమ పాలనలో నిరుద్యోగ యువతకు చేసిన అన్యాయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, మెగా డీఎస్సీ నిర్వహిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా సమగ్ర డీఎస్సీ నిర్వహించలేదని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేసి, ఉద్యోగ నియామకాల విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకుని ప్రజలకు వాస్తవాలు చెప్పాలని హితవు పలికారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి బీసీ

**: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచన**
**బనగానపల్లె, మే 31 ప్రభాతవార్త:**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్‌ను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదివారం బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) నంద్యాల జిల్లా అధికారులు మంత్రిని కలిసి పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బనగానపల్లె బైపాస్ రహదారికి ఇరువైపులా 500 మొక్కలు నాటే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే జూన్ 1 నుంచి జూన్ 5 వరకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నంద్యాల విభాగం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని



అధికారులకు సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఇటువంటి సామాజిక కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న తీవ్ర మార్పులకు మానవ కార్యకలాపాలే ప్రధాన కారణమని గుర్తించి, పర్యావరణ అనుకూల జీవన విధానాలను అవలంబించాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

## నేడు దేవనకొండకు ఎమ్మెల్యే రాక

**– వైసీపీ బూత్‌లెవల్ ఏజెంట్లకు సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సదస్సు : జెడ్పీటీసీ రామకృష్ణ**
**దేవనకొండ, మే 31, ప్రభాతవార్త;**
మండలకేంద్రమైన దేవనకొండలోని మూగితాత కళ్యాణ మండపంలో బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్సీపీ దేవనకొండ మండల కన్వీనర్, జెడ్పీటీసీ రామకృష్ణ (కిట్టు) తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్-స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అవగాహన సదస్సు కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు, కన్వీనర్స్, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్స్ ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు, రెండు ఫోటోస్ తీసుకురావాలన్నారు.

## ఏకాగ్రత, సాధన తోనే క్రీడాకారులు రాణించాలి

**కర్నూలు స్పోర్ట్స్ రిపోర్టర్ మే31 ప్రభాతవార్త:**



విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చు అని డాక్టర్ వాసు రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలను జిల్లా క్రీడల అధికారి భూపతిరావు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డా వాసురెడ్డి మాట్లాడుతూ ప్రాచీన క్రీడల్లో ఒకటైన విల్లు విద్యను క్రీడాకారులు సాధన చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఏకాగ్రతతో సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏదీ లేదని అన్నారు. అనంతరం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా క్రీడాకారుల దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆర్చరీ సంఘం పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, జాతీయ ఆర్చరీ కోచ్ వంశీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి రూ1,00,116 విరాళం



**బనగానపల్లె, మే 31 ప్రభాతవార్త:**
మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కోసం కర్నూలు జిల్లా ఆదోని వాస్తవ్యులు పూదూరు రాఘవేంద్ర, పూదూరు వేణుగోపాల్ వారి కుటుంబ సభ్యులు రూ 1,00,116 (ఒక లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కారం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

**: డోన్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నూరుల్లా**



**ఆత్మకూరు మే 31 ప్రభాతవార్త :**
ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ కెవికె స్టేడియం నందు ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ లో జరిగిన ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథిగా డోన్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నూరుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు అన్ని క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ ను ఐపీఎల్ తరహాలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ టోర్నమెంట్ లో గ్రామీణ క్రీడాకారులతో పాటు ఆత్మకూరు పట్టణంలో ఉన్న ఆసక్తిగా క్రీడాకారులను దాదాపుగా 150 మందిని ఎంపిక చెయ్యడం గొప్ప విషయమన్నారు. స్పోర్ట్స్ క్లబ్ కోశాధికారి పటాన్ నాగూర్ ఖాన్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చెయ్యడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పిల్ మున్నా, స్టేడియం ఇంచార్జి జునైద్ భాష, స్పోర్ట్స్ ఉపాధ్యక్షుడు మోమిన్.యూసఫ్, ఆసిఫ్, జబ్బార్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు.. : మంత్రి ఫరూక్

**వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వెనుక వైకాపా కుట్రపూరిత రాజకీయాలు : మంత్రి బి.సి.**

**నంద్యాల మే 31 ప్రభాతవార్త ప్రతినిధి**
రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్రపూరిత డ్రామాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు . ఈరోజు నంద్యాల పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారితో పాటు రాష్ట్ర రోడ్లు , భవనాలు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, జోనల్ 5 టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం ఎల్లప్పుడూ ప్రశాంతతకు, మతసామరస్యానికి మారుపేరని, ఇక్కడి ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు . నంద్యాలలో చోటుచేసుకున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై మంత్రి స్పందిస్తూ, ఆ విగ్రహాన్ని తాము పగులగొట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ విధమైన చౌకబారు విమర్శలు మరియు నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. గతంలో కోడికత్తి డ్రామాలు ఆడిన చరిత్ర వారిదేనని, ఇప్పుడు కూడా అలాంటి కుతంత్రాలనే పునరావృతం చేస్తున్నారని విమర్శించారు. నంద్యాలలో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నారనే అక్కసుతో, ఇక్కడి నుండి బేస్ చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులతో తాము ఇప్పటికే మాట్లాడామని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఇటువంటి పనికిమాలిన పనులు చేసే అరాచక శక్తులను మరియు దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు దూసుకుపోతోందని మంత్రి ఫరూక్ తెలిపారు . తాము ఎప్పుడూ శాంతియుత రాజకీయాలనే నమ్ముకున్నామని, సుమారు 45 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానని, ఎన్నడూ పార్టీలు మారలేదని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇటువంటి అరాచక శక్తుల ఆటలు సాగనివ్వబోమని, ప్రజలంతా వాస్తవాలను గమనిస్తున్నారని ఆయన తెలిపారు .



నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఉదయం నంద్యాల పట్టణంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని వైకాపా అనుచరుడే స్వయంగా ధ్వంసం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రయత్నించాడని ఆధారాలతో సహా నిరూపించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు చాకలి జంబులయ్య అనే వ్యక్తి అని, అతను వైకాపా స్థానిక కౌన్సిలర్ మరియు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అనుచరుడనడానికి తగిన ఫోటో ఆధారాలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మీడియాకు విడుదల చేశారు.

## తెగి పడ్డ మహానేత విగ్రహం తల ఒకరిపై మరోకరు అరోపనలు పోలీసుల అదుపులో నిందితుడు

**నంద్యాల,క్రైమ్,31, ప్రభాతవార్త :**



నంద్యాల మహా నేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం తల తెగిపడటముతో నిందితుడు అదుపులో ఉన్న ఒకరిపై మరోకరుల రాజకీయ అరోపనలు చేసుకువటున్నారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాససెంటరులో ఉన్న మహానేత వైయస్అర్ విగ్రహము తలను అందరూ చూస్తుండగా చాలకి జంబులయ్య అనే వ్యక్తి నరికి తలను తీసుకుని వెల్లాడు. అయితే సంఘనట జరిగిన వెంటనే కూటిమి నేతలు జంబులయ్య వైసిపి పార్టి కార్యకర్త అంటు చిత్రాలు విడుదల చేయడము వైసిపి బగ్గుమంటుంది. నిజముగా ఇది రాజకీయ కుట్రంఅటు నిందరోపనలు చేస్తుంది. అయితే మహానేత తలను తెంచిన వ్యక్తి కఠినంగా శిక్షించాలంటు జనసేన నాయకులు సుదాకరు. చందు తతితరులు ఖండించారు. అయితే ఇది రాజకీయ కుట్రఅంటు ఎమ్మెల్సీ ఇస్సాకు భాష విగ్రమము వద్ద దర్నా చేపట్టారు. అయితేతలనుతెంచిన నిందితుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాని అతను మతిస్థిమితము లేని వాడని ఇటీవల 6మాసాలనుండి చికిత్స పొందుతున్నాడని అంటున్నారు. మొత్తం మీద మమా నేత విగ్రహము తల నరకడము నేరమే అని అంటున్నారు.

## మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం

**: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గార్లపాటి మద్దిలేటి**



**డోన్ మే 31 ప్రభాతవార్త :**
దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని నంద్యాల జిల్లాలోని శ్రీనివాస్ సెంటర్లో నడిబొడ్డున ఉన్న విగ్రహాన్ని ధ్వంసం చేస్తూ ఉంటే పోలీసులు ఆపకపోవడం దారుణమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడి జంబలయ్య కాల్ రికార్డును పరిశీలించాలని డిమాండ్ చేశారు ఇంత పబ్లిక్ గా ధ్వంసం చేస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం వైఫల్యం పూర్తిగా కనబడుతుందని అన్నారు జంబలయ్య ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వెంటనే విచారించి వివిధ కోణాల్లో ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా విగ్రహం ధ్వంసం వెనక ఏదైనా రాజకీయ కుట్ర జరుగుతుందో విచారించాలని డిమాండ్ చేశారు పోలీసులు ఉండి కూడా ఆపకపోవడం దీని వెనక చాలా కుట్రగా ఉన్నట్లు తెలిపారు వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు యు జనార్ధన్ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్ డోన్ మండల అధ్యక్షులు పట్టాను హుస్సేన్ డిసిసి కార్యదర్శులు గోపీనాథ్ రావు మధుసూదన్ రెడ్డి నాయకులు గిడ్డయ్య నాగన్న మహిళా నాయకులు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

## ముదిగేడులో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటన

**– నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ప్రారంభోత్సవాలు**
**సంజామల మే 31, ప్రభాతవార్త:**
రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సోమవారం సంజామల మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 7.30 గంటలకు ముదిగేడు గ్రామం చేరుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొని అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలకు ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈకార్యక్రమాలకు ఎన్డీయే కూటమి పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయి విజయవంతం చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయం వారు తెలిపారు.

# నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం చేయడం దారుణం

**: వైసిపి మైనార్టీ విభాగం శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు మోమిన్ ముస్తఫా**
**ఆత్మకూరు మే 31 ప్రభాతవార్త :**



నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్లో వైయస్సార్ విగ్రహాన్ని ఆదివారం దుండగులు దాడి చేసి ధ్వంసం చేయడం చాలా హేయమైన చర్య అని సభ్య సమాజం తలదించుకునేలా ఉందని శ్రీశైలం నియోజకవర్గం మైనార్టీ విభాగం అధ్యక్షుడు మోమిన్ ముస్తఫా తెలిపారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ఆత్మకూరు పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహం కూల్చివేత పై నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని అన్నారు అనంతరం మోమిన్ ముస్తఫా మాట్లాడుతూ 151 సీట్లతో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న 5 సం.లలో ఎన్టీఆర్ విగ్రహాల మీద ఎటువంటి దాడులు చేపియ్యలేదని, ఇదెక్కడి సంస్కృతి సంస్కారం అని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి వైసిపి నాయకులను హింసించడం పనిగా పెట్టుకుని, ఆఖరికి విగ్రహాల మీద దాడి చేయడం చాలా దారుణం అన్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా సేవలందిస్తూ ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్మెంట్ పథకం, రైతులకు రుణమాఫీ, 108 సేవలు ఇలా అనేక రకాలుగా పథకాలను తీసుకుని వచ్చి ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు అన్నారు. ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రచ్చబండ కార్యక్రమానికి వెళుతుండగా హెలికాప్టర్ కూలిపోయి మృతి చెందడం ప్రజల కోసమే ఆయన తన ప్రాణాలు అర్పించారని తెలిపారు. అటువంటి నాయకుడి విగ్రహాలను ధ్వంసం చేయాలని టీడీపీ కుట్రలు చేయడం చాలా దారుణం అన్నారు. విగ్రహాలు ధ్వంసం చేయడం వలన, వైసీపీ నాయకులను అరెస్టులు చేసి ఇబ్బంది పెట్టడం వలన, రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు భయపడతారని అనుకోవడం ,వైఎస్ఆర్ పేరును రాష్ట్రం నుంచి దూరం చేయాలని అనుకోవడం అది వారి యొక్క పొరపాటే గాని, అది అసంభవం అన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఆత్మకూరు పట్టణ మండల నాయకులు పట్టణాధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, వైసీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు అంజాద్ అలీ, సురేష్ ,వడ్డరాంపురం బాలస్వామి , మోమిన్ మునీర్, ధనుంజయ, జయ కృష్ణ, గౌస్ మాలిక్ నజుముద్దీన్ ఇలియాజ్ వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎగిరి పోయిన చలువ పందిరి వాసాలు...పట్టించుకోని మున్సిపాల్టి శాఖ

**–ఎండలోనే ట్రాఫిక్‌ల వద్ద వాహనాల దారులు**
**– టెండర్ ఎవరికి.. బిల్లులు ఎవరికి ,,?**
**నంద్యాల మున్సిపాల్టి,మే 31,ప్రభాతవార్త:**



ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉండడంతో మున్సిపాల్టి శాఖ వారు ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చలువ ఉండేందుకు దాదాపు 16 చోట్ల పందిర్లు వేయించినట్లు తెలిసింది. అయితే గత కొన్ని రోజుల క్రితం పలుచోట్ల చలువ పందిర్లు విరిగి పోయాయి. వాటిని పర్యవేక్షించే కాంట్రాక్టర్ వాటి వైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు కాంట్రాక్టర్ ఎవరు..? టెండర్ ఎంత, విరిగిన వాటి గురించి పట్టించుకునే వారెవరు అనేది ప్రశ్నగా మిగిలిపోయింది. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయం వద్దనే పందిరి వాసం విరిగిపోయి ప్రమాదకరరంగా వేలాడుతున్న నిత్యం అదే దారిలో వెళుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిభంధనల ప్రకారం చలువ పందిర్లు టెండర్ల ప్రక్రియ నోటీసును, టెండర్ ఎంతకు దక్కించుకున్నారు, ఎన్ని నెలలు ఏర్పాటు చేయాలి అన్న వివరాలు మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పెట్టాలి. అయితే మున్సిపల్ అధికారులు అన్ని గోప్యంగా ఉంచడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కావున సంభంధిత అధికారులు ఎన్ని చోట్ల చలువ పందిర్లు ఎగిరిపోయాయి, కాంట్రాక్టర్‌కు ఎంత బిల్లు చెల్లించారో ప్రజలకు తెలియజేయాల్సిన భాధ్యత అధికారులదేనని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# రాయలసీమ ప్రాజెక్టుల పంటకాలువల పనులు జూన్-జూలైలో పూర్తి చేయాలి

**లేకపోతే ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి**
**నంద్యాల మే 31 ప్రభాతవార్త ప్రతినిధి**
రాయలసీమ సాగునీటి హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ ఆదివారం నంద్యాల శివారులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఘనంగా జరిగింది. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ బహిరంగ సమాలోచన సదస్సుకు రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది రైతులు, ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనివార్య కారణాల వల్ల సభకు హాజరుకాలేకపోయిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ్ ఆన్‌లైన్ ద్వారా సందేశాన్ని అందించారు.



సభ ప్రారంభంలో బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన“సహజ సంపదల సిరిరా… రాయలసీమ నువ్వే మా గర్వప్రతీకరా” అనే ప్రత్యేక గీతాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, నందమూరి తారక రామారావు చేపట్టిన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు ఎస్ ఆర్ బి సి, తెలుగుగంగ, హెచ్ ఎన్ ఎస్ ఎస్, జి ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్టులు పూర్తి కావడానికి 40 ఏళ్లు పట్టడం, అవి ఇంకా పూర్తి కాకపోవడం భాధేస్తోందని, గోదావరి నీళ్లు బానకచర్లలో పోయడం కన్నా శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీళ్లు దిగువకు వదలకుండా పూర్తిగా రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయిస్తే వలసలు, కరువు పోతుందని, రైతులు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం చేస్తే సాగునీరు సాధ్యం అవుతుందని మాజీ మంత్రి వడ్డే శోభనాధీశ్వరరావు అన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ మాట్లాడుతూ, రాయలసీమ ప్రజలు తమ ఆత్మగౌరవంతో ఏకమైతేనే పాలకులు స్పందిస్తారని అన్నారు. “ఏళ్ల తరబడి కాలువలు పూర్తికాక, ఎకరాలకు నీరందక భూములు ఎండిపోతున్నాయి. ఇక చూస్తూ ఊరుకోలేం. అవసరమైతే మేమే పనులు ప్రారంభిస్తాం. మన ప్రాంత అభివృద్ధిని మనమే చేతుల్లోకి తీసుకుని, మన నీటి వాటాను మనమే సాధించుకోవాలి” అని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు మాట్లాడుతూ, కృష్ణా డెల్టా, ప్రకాశం బ్యారేజీకి వెళ్లే జలాల మూలం రాయలసీమలో ప్రవహించే తుంగభద్ర, కృష్ణా నదులేనని గుర్తుచేశారు. “లక్షల క్యూసెక్కుల వరద నీరు సీమ కళ్లముందే సముద్రం పాలవుతుండగా, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులకు నీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. ఈ మహాసభలో విరసం వరలక్ష్మి, జలసాధన సమితి అనంతపురం, రాయలసీమ సామాజిక వేదిక నాయకులు డాక్టర్ నాగన్న, డాక్టర్ బ్రహ్మారెడ్డి, తీరేలీ సహదేవరెడ్డి, కడప, మైదుకూరు రమణ, ప్రతినిధి కె.రామాంజనేయులు, రాయలసీమ విద్యా వంతుల వేదిక, ప్రతినిధి రాజశేఖర్, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, డిటియఫ్ నాయకులు రత్నం ఏసేపు, వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, బాలీశ్వరరెడ్డి, బెక్కం రామసుబ్బారెడ్డి పలు ప్రజా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు